పార్వతి తనయా.. పాహిమాం


జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌కాలనీలో పూజలు చేస్తున్న అమ్మ యువజన సంఘం సభ్యులు


దేవరకద్ర రాయచూర్‌రోడ్‌లో ప్రతిష్ఠించిన గణేశుడికి పూజలు చేస్తున్న భక్తులు


నవాబుపేట శివాలయంలో ప్రతిష్ఠించిన గణపతి పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


ఎస్‌ఆర్ నగర్‌లో పూజలు చేస్తున్న అయోధ్య యూత్ అసోసియేషన్ సభ్యులు


దేవునిగుట్టలోని జర్నలిస్టు కాలనీలో పూజలు చేస్తున్న ముడా చైర్మన్ లక్ష్మణ్, నాయకుడు సురేందర్‌రెడ్డి

స్వచ్ఛత కనుమరుగు

- ఇళ్లమధ్యనే మురుగు.. ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు
- దోమలతో స్థానికుల ఇక్కట్లు.. పట్టించుకోని అధికారులు

నవాబుపేట: అపరిశుభ్రతతో అంటూవ్యాధులు ప్రబలుతుంటే.. మరోపక్క అధికారులు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా.. గ్రామాల్లో మాత్రం పారిశుద్ధ్యం పత్తాలేకుండా పోయింది. ఎక్కడపడితే అక్కడ మురుగు నిల్వలు ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం ఇబ్బందులతోనే కాలం గడుపుతున్నారు. మండలంలోని సిద్ధోటంలో ఇళ్ల మధ్యన మురుగు నిల్వలతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. నిత్యం దోమల బెడదతో ఇబ్బందులు పడుతుంటే పంచాయతీ అధికారులు మాత్రం స్పందించడం లేదు. అలాగే ఇళ్లపక్కనే ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెద్దగా పెరిగి భయంకరంగా మారాయి. పాములు తదితర విషపురుగులకు ఆవాసంగా మారాయి. చిన్నపిల్లలు తిరిగేచోట ఇలాంటి పరిస్థితి ఉన్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో పంచాయతీ నిర్లక్ష్యం వీడి అపరిశుభ్రతను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


సిద్ధోటంలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీరు


అంగన్‌వాడీ ఎదుట మొలిచిన పిచ్చిమొక్కలు

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్


మూసాపేటలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను శనివారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. వచ్చేనెల 3న సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు రానున్న నేపథ్యంలో చివరి దశలో నిర్మాణం పనులు జరుగుతున్న ఇళ్లను కలెక్టర్ పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చూడాలని ఆదేశించారు. సీఎం పర్యటనకు సంబంధించిన అంశాలపై అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్ పీడీ భాస్కర్‌తో చర్చించారు. సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై శాఖలవారీగా అధికారులు దృష్టిసారించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ కృష్ణయ్య, డీఈ లక్ష్మణ్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, ఎంపీఓ అనురాధ, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎస్సీ బాలికల వసతి గృహం తనిఖీ



మిడ్జిల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శనివారం సాయంత్రం మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అద్దె భవనంలో కొనసాగుతుండడంతో వర్షానికి కురుస్తుందని విద్యార్థినులు తెలిపారు. వారికి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని వార్డెన్ యశోదకు సూచించారు.

గ్రామాల్లో అల్లర్లకు తావివ్వొద్దు



మహమ్మదాబాద్: స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎలాంటి అల్లర్లు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీల నాయకులదేనని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమయంలో ప్రభుత్వ విధివిధానాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఆయా పార్టీల నాయకులు తమ కార్యకర్తలకు నాయకులకు గ్రామాలవారీగా అవగాహన కల్పించాలని, తగిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్రాంరెడ్డి, రాజేశ్వర్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

జడ్చర్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్లలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బిల్లును అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని ఎన్నికలకు వెళ్లాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, శేఖర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మండపం వద్ద ముస్లిం యువకుడి అన్నదానం



మహమ్మదాబాద్: హిందూ ముస్లింలు అందరూ ఒక్కటే అన్నదమ్ముల్లా ఉండాలని చాటిచెబుతూ ఓ ముస్లిం యువకుడు గణేశ్ మండపం వద్ద అన్నదానం చేశాడు. మండల కేంద్రానికి చెందిన రంజాన్‌అలీ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్దకెళ్లి అక్కడికి వచ్చిన భక్తులు, కాలనీవాసులకు అన్నదానం చేసి మిత్రుత్వాన్ని చాటుకున్నారు. స్థానికులు అభినందించి సన్మానం చేశారు.

భక్తులకు అన్నదానం

జడ్చర్ల: స్థానిక తాలుకా క్లబ్ ఏరియాలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా శనివారం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా పలువురు విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణతో భక్తులను అలరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, స్థానిక కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కోస్గి రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కోస్గి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ క్రీడారంగంలో రాణిస్తున్న విద్యార్థులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్లవిజయ్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్‌గౌడ్ దుస్తులను అందజేశారు. అనంతరం పాఠశాలకు గోడ గడియారాన్ని వితరణ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



రాజాపూర్(బాలానగర్): కూరగాయల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారి మహేందర్ పేర్కొన్నారు. శనివారం బాలానగర్ మండలంలోని చిన్నరేవల్లి రైతువేదికలో రైతులకు కూరగాయల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యానశాఖ ద్వారా ప్రస్తుతం కూరగాయల సాగుకు తీసుకుంటున్న చర్యలు, రాయితీలపై క్లుప్తంగా వివరించారు. ప్రస్తుతం రైతులకు ఉచితంగా టమోట, వంకాయ, మిరప నారును జీడిమెట్లలోని ఉద్యానశాఖ నర్సరీలో ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారులు నాగరాజుగౌడ్, దీప, రైతులు పాల్గొన్నారు.

రైతులపై దాడి హేయం

మరికల్: యూరియా కోసం వచ్చిన రైతులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా పార్టీ నాయకులు రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం తీలేర్ సొసైటీ దగ్గర రైతులతో మాట్లాడిన తర్వాత వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యం వల్లే రైతులకు సరిపడా యూరియాను అధికారులు పంపిణీ చేయడం లేదన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకొని సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బసంత్, కృష్ణారెడ్డి, బాలకిష్ట, మతిన్, శ్రీను, హన్మిరెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరులో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు

మద్దూరు: పట్టణంలో విద్యుత్ అధికారులు నూతన విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని రావులపల్లి రోడ్‌లోని ప్రాథమిక పాఠశాల నుంచి కోస్గి రోడ్‌లోని సినిమా థియేటర్ వరకు ఈ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు 9.1 మీటర్ల వరకు 32 కొత్త విద్యుత్ స్తంభాలను, 11 కేవీ విద్యుత్‌లైన్‌తో పాటు గృహ వినియోగానికి మరో లైన్ ఏర్పాటు చేశారు. ఇందు కోసం ప్రత్యేకంగా 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఇందు కోసం దాదాపు రూ. 24 లక్షల వ్యయం అయిందని విద్యుత్ అధికారులు తెలిపారు. పట్టణంలో వినాయకుడి విగ్రహం నిమజ్జనానికి వెళ్లే దారిలో గతంలో ఓ వైపు మాత్రమే విద్యుత్ స్తంభాలు ఉండడంతో విద్యుత్ తీగలు తగిలి నిమజ్జనం కష్టంగా మారడంతో ఈ విషయాన్ని స్థానిక నాయకులు కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించడంతో యుద్ధ ప్రతిపాదికన విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతలపై దృష్టిసారించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

చిన్నచింతకుంట: శాంతిభద్రతలపై దృష్టిసారించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.జానకి పోలీస్ సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా శనివారం చిన్నచింతకుంట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని పరిసరాలు పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ముందుగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల శాంతి భద్రతలే తమ ధ్యేయమన్నారు. అందుకు సిబ్బంది ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులందరికీ సమానంగా సేవలందించాలని పేర్కొన్నారు. ప్రతి కేసును పారదర్శకతతో విచారణ జరిపి శిక్షల శాతం పెంచే దిశగా కృషి చేయాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్


మాట్లాడుతున్న విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్

మిడ్జిల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో విద్యా కమిషన్ ఏర్పాటు చేసి పాఠశాల విద్యాబోధన, మౌలిక సదుపాయలు, టీచర్ల సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనకు ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లలో విద్యా వ్యవస్థను బీఆర్‌ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, సంవత్సరంలో రెండుసార్లు ప్రమోషన్లు ఇచ్చిన ఘనత ప్రజాప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ బడుల బలోపేతానికి తమవంతు కృషి చేయాలని కోరారు. నిరుపేదలకు నాణ్యమైన విద్య అందించాలని ఇంటిగ్రేటెడ్ స్కూల్ తీసుకురావడంతో నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు బాలయ్య, శ్రీను నాయక్, సంపత్‌కుమార్, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

పౌరులు హక్కులను కాపాడుకోవాలి


గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి

మహమ్మదాబాద్: పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలని తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మొకర్లాబాద్‌లో పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఓటు అర్హత కలిగిన ప్రతి యువతీ, యువకుడు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్త వహించాలని సూచించారు. విషజ్వరాలతో ఎంతోమంది ఆస్పత్రులకు వెళ్తున్నారని తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని గ్రహించారు. అందుకు ఆరోగ్యశాఖ సూచనలు, సలహాలు పాటించాలని తెలిపారు. గ్రామంలో వయస్సుకు తగిన బరువులేని పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. లేకుంటే జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స చేసుకునేందుకు వారిని పంపించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని అలాంటి బాధ్యతలు మహిళలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ హైమద్, గ్రామస్తులు లక్ష్మయ్య, మైబయ్య, గోవర్ధన్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరిధి పేరిట దోబూచులాట

- గుంతలమయంగా కౌకుంట్ల–పుట్టపల్లి రోడ్డు
- పట్టించుకోని రైల్వే, ఆర్‌అండ్‌బీ
- శాశ్వత పరిష్కారం చూపాలని నిరసన


పుట్టపల్లి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

దేవరకద్ర రూరల్: కౌకుంట్ల–పుట్టపల్లి మధ్య ఉన్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నాయకులు, గ్రామస్తులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రైల్వేట్రాక్ అవతలి వైపు రైల్వే గోదాములు నిర్మించిన అనంతరం అధికారులు బీటీరోడ్డు మీదుగా ఉన్న రైల్వే గేట్‌ను మూసివేసి తాత్కాలికంగా పుట్టపల్లి మీదుగా ప్రజల రాకపోకలను మళ్లించారు. అయితే కిలోమీటర్ మేర పైన ఉన్న ఈ రోడ్డును పదేళ్లుగా అటు ఆర్‌అండ్‌బీ అధికారులు, ఇటు రైల్వే అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. వర్షాకాలంలో రహదారి మొత్తం చిత్తడిగా మారుతుంది. గోదాం లారీల రాకపోకలతో పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులను సంప్రదిస్తే మా పరిధి కాదంటూ దాటవేస్తున్నారు. ఇప్పటికైనా.. సంబధిత అధికారులు చొరువ తీసుకొని రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అయితే స్థానిక నాయకులు సమస్యను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, నరేశ్, చెన్నకేశవులు, కొండన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన

నవాబుపేట: ఈ ఓటు ఆ వార్డులో ఉండాలి.. భర్త ఓటు ఒకటో వార్డులో.. భార్య ఓటు మూడో వార్డులో ఉంటుంది.. దీంతో గతంలో చాలా ఇబ్బందులు పడ్డాం. అందుకే ఇలాంటివి తొలగించి ఒక కుటుంబం ఓట్లు ఒకే వార్డు పరిధిలోకి వచ్చేలా జాబితాలు రూపొందించాలని వివిధ పార్టీల నాయకులు అధికారులకు సూచించారు. శనివారం ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో అధికారులు పంచాయతీలలో జాబితాలు ప్రదర్శించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం గ్రామాలవారీగా ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం రెండురోజుల క్రితం ప్రారంభమైంది. అసెంబ్లీ ఎన్నికలలో పొందుపరిచిన ఓటర్ల జాబితా ప్రకారం తాజాగా అదే జాబితా ఆధారంగా వార్డుల వారీగా జాబితాను పరిశీలించారు. కాగా జాబితాలో ఆరోపణలు ఉంటే ఆయా గ్రామాల్లోని పంచాయతీ అధికారులకు లేదా మండల కార్యాలయంలో తమ అభిప్రాయాలు తెలియజేయాలని అధికారులు సూచించారు. కాగా గతంలో 54 గ్రామాల్లో ఉన్న 456 వార్డులవారీగా జాబితాలను పరిశీలించే కార్యక్రమం చేపట్టినట్లు మండల అధికారులు వివరించారు. కాగా గతంలో వికారాబాద్ జిల్లాకు చెందిన 12 గ్రామాలు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉండగా.. తాజాగా ఆ గ్రామాలు తిరిగి వికారాబాద్ జిల్లా పరిధిలో చేరాయి. దీంతో 12 గ్రామాలు, 60 వార్డులు మినహాయిస్తే 42గ్రామాలు, 390 వార్డుల్లో జాబితాల పరిశీలన చేపట్టారు.

పీయూ ఇంజినీరింగ్‌లో మొదటి అడ్మిషన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాలలో లాసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించిన శ్రావణ్‌కుమార్ మొదటి అడ్మిషన్ పొందాడు. ఈ మేరకు అలాట్‌మెంట్ ఆర్డర్‌ను లా కళాశాల ప్రిన్సిపాల్ మాళవి, వైస్ ప్రిన్సిపాల్ భూమయ్య, రవికుమార్ అందజేశారు.

ఫిర్యాదులను పరిష్కరిస్తాం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యూవర్ డీఎంకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని డిపో మేనేజర్ సుజాత అన్నారు. శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు సమస్యలను ఫోన్‌లో డీఎంకు వివరించారు. పట్టణంలో మరిన్ని బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. మహబూబ్‌నగర్ నుంచి గచ్చిబౌలికి మరిన్ని బస్సులు నడపాలని ఫోన్‌లో కోరారు. మహబూబ్‌నగర్ నుంచి తాండూర్‌కు వెళ్లే బస్సులను సమయానికి అనుగుణంగా నడపాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న టీఎల్‌ఎం మేళా



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన మహబూబ్‌నగర్ అర్బన్ మండల స్థాయి టీఎల్‌ఎం మేళాలకు అనూహ్య స్పందన లభించింది. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మొత్తం 69 ప్రదర్శనలు ఆవిష్కరించారు. ప్రైమరీ పాఠశాలల తెలుగు మీడియం నుంచి 40, ప్రైమరీ ఉర్దు నుంచి 25, యూపీఎస్‌లు 4 పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను మెరుగు పర్చేందుకు టీఎల్‌ఎం మేళాలు ఉపయోగపడుతాయన్నారు. పెద్ద సంఖ్యలో టీఎల్‌ఎంల ప్రదర్శన వల్ల సబ్జెక్టులను సులువైన పద్ధతుల ద్వారా నేర్చుకునేందుకు అవకాశం ఉందని, విద్యార్థుల ఆలోచన సరళికి అనుగుణంగా బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, సీఆర్పీలు శ్రీనివాసులు, మెగులయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డుల విభజనపై అఖిలపక్ష సమావేశం

మిడ్జిల్: స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో వస్తుండడంతో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గీతాంజలి, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూతుల వివరాలు తెలిపారు. మండలంలో మొత్తం 25, 128 మంది ఓటర్లు ఉండగా, మహిళలు 12, 702 మంది, పురుషులు 12, 426 మంది ఉన్నారు. 9ఎంపీటీసీల పరిధిలో 46 పోలింగ్ కేంద్రాలు, పంచాయతీ ఎన్నికలలో 24 జీపీ ల్లో 204 వార్డులను విభజించి 204 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఎంపీఓ మొహమ్మద్ నసీర్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

దేవరకద్ర: దేవరకద్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు చిన్నరాజమూర్‌కు చెందిన గోపాల్, కుటుంబ సభ్యులను శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. గోపాల్ కుమారుడు అరుణ్‌కుమార్ జిల్లా కేంద్రంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ రెండురోజుల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పుత్రశోకంలో ఉన్న గోపాల్ ఇంటికెళ్లిన మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణరెడ్డి పరామర్శించారు.

ఆర్థిక సాయం

నవాబుపేట: కుటుంబ పోషణ సైతం కష్టంగా ఉన్న కుటుంబంలో తండ్రి లేని ఆడబిడ్డ వివాహానికి తనవంతుగా ఆర్థిక సాయం అందించాడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి. మండల కేంద్రంలో ఆదివారం జరగాల్సిన మహ్మద్ ఆలీ కూతురు వివాహానికి శనివారం రూ.5వేలు ఆర్థిక సాయం ఇచ్చి అండగా నిలిచారు.